క్లుప్తంగా

నేటి నగరి కొండచుట్టుకు ఏర్పాట్లు పూర్తి

నారాయణవనం: మండలంలో టీటీడీ అనుబంధ శైవ క్షేత్రాల ఉత్సవమూర్తులు నగరిలో బుధవారం నిర్వహించే కొండచుట్టు ఉత్సవంలో పాల్గొనే కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ఆలయాల అధికారి నాగరాజు తెలిపారు. సంక్రాంతి మూడో రోజున పరిసర గ్రామాలల శైవక్షేత్రాల ఉత్సవమూర్తులు నగరిలో నిర్వహించే గిరిప్రదక్షిణ ఉత్సవంలో పాల్గొంటారు. నారాయణవనంలోని టీటీడీ అనుబంధ ఆలయాల పరాశురేశ్వర స్వామి, అగస్తీశ్వరస్వామితో పాటు తుంబూరు తుంబీశ్వరస్వామి, పాలమంగళం పాలీశ్వరస్వామి ఎలకాటూరు, ఆరూరు, బుగ్గ అగ్రహారాల మీదుగా ఊరేగింపుగా వెళ్లి నగరిలో గిరి ప్రదక్షిణ ఉత్సవంలో వేంచేపు చేస్తారు. బుధవారం సముదాయంలోని మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి, నారాయణవనంలోని చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా నగరికి వేంచేపు చేయనున్నట్లు నాగరాజు తెలిపారు. ఉదయం 8 గంటలకు సముదాయంలోని ఆరుణానదిలో జరిగే ఉత్సవ మూర్తుల సంధింపు కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

హరివరాసనం..


పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపం వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, సుగంధ పరిమళ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ


ట్యాబ్‌లు అందజేస్తున్న హెచ్‌ఎం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతి విద్యార్థులు 15 మందికి బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు కొంగర మునిరెడ్డి(58) అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబాన్ని పరామర్శించి, శ్మశానం వరకు పాడిని మోశారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, కోదండ రామిరెడ్డి, రవిచంద్రారెడ్డి, మునీంద్రబాబు, శేఖర్‌రెడ్డి, దామోధరం రెడ్డి, హరిదాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో లక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమంలోని 48మంది దివ్యాంగులు, వృద్ధులకు మంగళవారం ప్రజా సాధికారిక సమితి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రజా సాధికారిక సమితి కార్యదర్శి దేవేంద్ర, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, ఆదర్శ సేవా సంస్థ వ్యవస్థాపకుడు గురునాథం, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సైదమ్మ, పాల్గొన్నారు.

వార్డు సభ్యుడు మృతి


సుబ్రమణ్యంశెట్టి

నారాయణవనం: వైఎస్సార్ సీపీ నాయకుడు, నారాయణవనం పంచాయతీ 15వ వార్డు సభ్యుడు, ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యంశెట్టి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల జెడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ బాబు, సర్పంచ్ శారదాగణేషన్, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, ఆటో కార్మికులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి గిరిప్రదక్షిణ సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు పాదిలి శివకుమార్ ఆధ్వర్యంలో భక్తులకుఅన్నదానం చేశారు, కేసరి పంపిణీ చేశారు. శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మల్లెంబాక మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




భక్తి విరిసింది..కైలాసగిరి మురిసింది




కైలాసగిరి పర్వతశ్రేణులు శివ నామస్మరణతో పులకించాయి. శ్రీకాళహస్తి క్షేత్రంలో మంగళవారం కైలాసగిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా జరిగింది. అశేషంగా భక్తులు తరలివచ్చారు. శ్రీస్వామి, అమ్మవార్ల వెంట దాదాపు 21 కిలోమీటర్లు ఉన్న కైలాసగిరిని ఓం నమశ్శివాయ అంటూ స్మరిస్తూ పారవశ్యంలో మునిగితేలారు. ఉదయం ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు విశేష పూజలు అందుకుని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కళా ప్రదర్శనల నడుమ గిరిప్రదక్షిణకు బయలుదేరారు. అప్పటికే ఆలయం వద్దకు చేరుకున్న అశేష భక్తులు స్వామి, అమ్మవార్ల వెంట అడుగులు వేశారు. సాయంత్రం శుక్రబ్రహ్మాశ్రం వద్దకు భక్తులు తండోపతండాలుగా వెళ్లి ఎదురుసేవలో స్వామి, అమ్మవార్లను దర్శించి పులకించారు. గిరి ప్రదక్షిణ అనంతరం ఆలయం వద్దకు ఉత్సవమూర్తులు చేరుకోగానే ఒక్కసారిగా హరహర మహాదేవా అంటూ శివ నామస్మరణ హోరెత్తింది. ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. గిరి ప్రదక్షిణకు దేవస్థానం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మార్గమధ్యమంలో అన్నదానాలు చేశారు. – శ్రీకాళహస్తి



గిరి ప్రదక్షిణ అనంతరం మంగళవారం రాత్రి పురవీధుల్లో విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

వైభవంగా పుర ఉత్సవం


ఎదురు సేవ మండపం వద్ద పూజలు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి పుర ఉత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. అంతకు ముందు గిరిప్రదక్షిణలో భాగంగా స్వామి, అమ్మవార్లను ఎదురుసేవ మండపం వద్ద కొలువుదీర్చారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్లను ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు , మేళతాళాలు,మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రజలు బారులు తీరారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. గోదా పరిణయోత్సవం


సంక్రాంతి ఉత్సవంలో స్వామి,అమ్మవార్లు


ఊరేగింపులో గోదాదేవితో వేంకటేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గోదాదేవికి, కల్యాణ వెంకన్నకు వైఖానస ఆగమోక్తంగా మాలమార్పిడి కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయన్ని తెరచిన అర్చకులు నిత్యపూజాకైంకర్యాలను పూర్తి చేసి తొలి గంటతో నైవేద్య సమర్పణ చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం గోదాదేవిని పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించారు. అనంతరం తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధిలో ఊరేగింపుగా సన్నిధి వీధిలోని పదహారు కాళ్ల మండపం చేరుకున్న అమ్మవారికి, తిరుచ్చిపై కల్యాణ వేంకటేశ్వస్వామి ఎదురేగారు. మేళతాళాలు, వేద ఘోష మధ్య అర్చకులు గోదాదేవికి, కల్యాణ వెంకన్నకు మూడు మార్లు మాల మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న గోదాదేవి సమేత కల్యాణ వెంకన్నకు ఆస్థానం నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంతసేవతో భోగ శ్రీనివాసుని పవలింపు సేవను నిర్వహించారు. అలాగే సోమవారం ఆలయంలో సంక్రాంతి ఉత్సవాన్ని నిర్వహించారు. మరక సంక్రమణ గడియల్లో ఉత్సవమూర్తులకు ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవీ,భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులను అందుకున్నారు. గోవింద నామస్మరణ మిన్నంటింది. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు సంక్రాంతి ఆస్థానం నిర్వహించి దీప, ధూప నైవేద్యాలను సమర్పించారు. ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయంలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు శివార్లలో కోడిపందేల స్థావరంపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. నలుగురుని అరెస్టు చేసి, 2 కోళ్లు, రూ.3200 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కానిస్టేబుళ్లు రమేష్, శరత్, అరుణ్, రంగా ఈ దాడిలో పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

కేవీబీపురం: మండలంలోని ఆరె గ్రామానికి చెందిన జయమ్మ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని అందజేశారు. జయమ్మ(43) సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. జెడ్పీటీసీ మూర్తి మునెమ్మ, ఎంపీటీసీ మూర్తి సుబ్బన్న వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.వెయ్యి అందించారు.

శాస్త్రోక్తంగా పల్లకి గిరిప్రదక్షిణ


విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు


పురవీధుల్లో ఊరేగుతున్న గౌరమ్మ

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంక్రాంతిని పురస్కరించుకుని సోమ వారం శాస్త్రోక్తంగా పంచమూర్తుల పల్లకి గిరిప్రదక్షిణ నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణలో భాగంగా పంచమూర్తుల పల్లకి గిరిప్రదక్షిణ నిర్వహించడం ఆనవాయితీ. ఈ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గొబ్బెమ్మ అమ్మవారికి అలంకార మండపంలో పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అమ్మవారిని సింహవాహనంపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

నిత్యపూజలకు రూ.50వేల విరాళం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న నిత్యపూజలకు, నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన గాలి శ్రీనివాసరావు, నవనీత నందన్ దంపతులు మంగళవారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆలయ పీఆర్వో రవిని కలిసి ఈమేరకు విరాళం అందజేశారు. దాతకు శ్రీస్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించారు.

● పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం శ్రీగోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం ఆగమోక్తంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు

రహదారి భద్రతపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ రియాజ్ మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు నియమాలను తప్పని సరిగా పాటించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ టేకింగ్ విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి, చక్రవర్తి, మారయ్య, వెంకటేష్, సుబ్బారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం


కుటుంబ సభ్యులకు బిడ్డను అప్పగిస్తున్న ఈఎంటీ నాగరాజు

కేవీబీపురం: మండలంలోని ఆదవరం గిరిజన కాలనీకి చెందిన సునీత(19) సోమవారం 108 వాహనంలో బిడ్డను ప్రసవించింది. వేకువజామున ఆమెకు పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబసభ్యులు 108కి సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న 108 సిబ్బంది గర్భిణిని శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. మార్గమధ్యమంలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. తప్పని పరిస్థితుల్లో పైలెట్ నాగయ్య వాహనాన్ని రోడ్డు పక్కగా ఆపి ఆశా సుబ్బరత్నం సహాయంతో చికిత్స అందించారు. ఆ మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను శ్రీకాళహస్తికి తరలించి వైద్యం అందిస్తున్నారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. ఈఎంటీ నాగరాజు, ఆశా సుబ్బరత్నం సేవలను పలువురు అభినందించారు.

వేడుకగా సూర్యనారాయణ హోమం


హోమం నిర్వహిస్తున్న పండితులు

వరదయ్యపాళెం: మండలంలోని అమ్మాభగవాన్‌లకు చెందిన ఏకం ఆలయం ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం వరదయ్యపాళెం గోవర్ధనపురంలో లోకా ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో సూర్యనారాయణ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీఎస్‌కండ్రిగ, తడ, సూళ్లూరుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తిరుపతికి చెందిన రుత్విక్కుల ఆధ్వర్యంలో గణపతి పూజ, విష్వక్సేన, నవగ్రహ పూజ, సూర్యనారాయణ హోమం నిర్వహించారు. తీర్థప్రసాదాలతో పాటు అయోధ్య శ్రీరాముని అక్షింతలు భక్తులందరికీ అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లోకా ఫౌండేషన్ ప్రతినిధులు ఆచార్య ఆనందగిరిజీ, లోకేష్, సునీల్, లక్ష్మీ దాసాజీ, బొప్పన రమేష్‌బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు దామోదర్‌రెడ్డి, బొప్పన తిలక్‌బాబు, వెంకటేశ్వర్లు, చిన్నా, సుబ్రమణ్యం రెడ్డి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్‌పీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 1991–1994 బ్యాచ్‌కు చెందిన బీఎస్సీ, ఎంపీసీ చదివిన విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు. వీరిలో 70శాతం మంది విదేశాల్లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా వారు తమ కళాశాల స్మృతులను నెమరువేసుకున్నారు. తమ జ్ఞాపకాలను ఒకరితోఒకరు పంచుకున్నారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించారు. కొంతమంది అధ్యాపకులుగా, ఉపాధ్యాయులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్, పోలీస్‌శాఖలో స్థిరపడినవారు ఉన్నారు. మధు, నరేంద్ర, రాంబాబు, జానకి, కులశేఖర్, కాంతారావు, షణ్ముగం, ఎస్‌కే బాబు, అల్లయ్య, సురేష్, సుధాకర్, హేమకుమార్, రెడ్డి ప్రభ, పద్మ, సునీల, అరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో ఒక్కటైన పూర్వవిద్యార్థులు

పల్లె లోగిళ్లలో సంక్రాంతి సందడి




బీఎన్‌కండ్రిగ: ముగ్గులు వేస్తున్న మహిళలు, పిచ్చాటూరు: పరుగుపందెంలో చిన్నారులు, సత్యవేడు : బొమ్మరిల్లు వద్ద పశువులు


సత్యవేడు : స్నేహితురాళ్ల ఆత్మీయ సమావేశం

సత్యవేడు: సత్యవేడు నియోజక వర్గంలో మూడు రోజుల సంక్రాంతి సంబరాలు పల్లెల్లో అంబరాన్నంటాయి. ఇంటింటా పిండి వంటలతో కొత్త అల్లుళ్లు, కోడళ్లతో పాటు యువతీ యువకులు సంప్రదాయ వస్త్రధారణలతో సందడి చేశారు. పండుగలో కనుమ కళను సంతరించుకుంది. రంగు రంగు రంగవల్లికలు, గొబ్బెమ్మలు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టాయి. మంగళవారం సత్యవేడు మండలం ఇరుగుళం అంకాలమ్మ ఆలయం సంక్రాంతి వేడుకలకు వేదికైంది. సామూహిక గొబ్బె మ్మ పూజలు ఆనందోత్సాహాల నడుమ జరిగాయి. పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. ద్విచక్రవాహనాల పోటీలు ఆకట్టుకున్నాయి. మిత్రుల ఆత్మీయ సమ్మేళనాలు, ఆటల పోటీలతో యువతులు సందడి చేశారు. పశువులను శుభ్రం చేసి ఊరేగించారు. సత్యవేడులో క్రికెట్‌పోటీలు నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సంక్రాంతి, కనుమ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. సంక్రాంతిని పురస్కరించుకుని చనిపోయిన పెద్దలకు బట్టలు పెట్టారు. పలు రకాల పిండి వంటలు తయారు చేశారు. మంగళవారం కనుమ సందర్భంగా పశువులకు, గొబ్బెమ్మకు పూజలు చేశారు. బుచ్చినాయుడుకండ్రిగ బీసీ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: మండలంలో సంక్రాంతి, కనుమ సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి సందర్భంగా పితృ దేవతలకు బట్టలు పెట్టి పెద్దలపై ప్రేమాభిమానాలను చాటుకున్నారు. తర్పణాలను వదిలారు. మంగళవారం ఊరూరా పశువుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కళత్తూరులో వెలసిన శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్వేటి ఉత్సవం వైభవంగా జరిగింది. గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు మోహనాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు: సంక్రాంతి, కనుమ పండుగలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం కుటుంబంలో మరణించిన వారికి బట్టలు పెట్టి కొలిచారు. మంగళవారం గోవులకు పూజలు చేశారు. పిచ్చాటూరు సచివాలయం వద్ద వివిధ రకాల పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచినవారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.


వరదయ్యపాళెం : గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు


వరదయ్యపాళెం: గొబ్బి తడుతున్న మహిళలు